# పెద్దమనసు

**మా**వా! యీ పొద్దు డూటీకి ఎల్దం మానీకూడదూ!" అంది సీతాలు తన భర్త రాములుతో. భార్య మాటలకు క్షణకాలం నిర్ఘాంతపోయేడు డ్రైవరు రాములు.

"నాన్నా!' యీ రోజు నాకు ప్రైజులు ఇస్తారు. మర్చిపోయేవేంటి? నిన్నూ అమ్మనూ తప్పక తీసుకొని రమ్మనమని మా టీచరు చెప్పేరు. ఇవాళ మా స్కూలుకి మినిస్టరు గారు కూడ వస్తారుట! మాకు ప్రైజులు మినిస్టరుగారి చేత ఇప్పిస్తారుట" అన్నాడు సూర్యం వుషారుగా.

రాములుకి ఒక్కగానొక్క కొడుకు సూర్యం. మంచి తెలివైనవాడు. తన స్తోమతకు మించిన దైనా రాములు తన కొడుకుని కాన్వెంటులో చదివిస్తున్నాడు. సూర్యం సెవెన్త్ క్లాసు చదువుతున్నాడు. గత నాలుగు సంవత్సరాలుగా వాడు ప్రతియేడూ స్కూలు ఫస్టు వస్తున్నాడు. అందువల్ల వాడికి మెరిట్ స్కాలర్‌షిప్ యిచ్చేరు. అంతేకాకుండా పుస్తకాలకు యూనిఫాంకి ప్రతియేడూ డబ్బు ఇస్తున్నారు.

బాలల దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వమువారు ఈ యేడు ఇంటర్ స్కూలు వ్యాస రచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించేరు. సూర్యానికి ఆ రెండింటిలోనూ ప్రథమ బహుమతులు వచ్చేయి. ఆ బహుమతి ప్రదానం యీ రోజు మంత్రిగారు వాళ్ళ స్కూల్లో చేస్తారు.

రాములు తన కొడుకు సూర్యంపైన ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. వాడికి పెద్ద చదువులు చెప్పించి వృద్ధిలోకి తేవాలని అతని కోరిక. తను చిన్నప్పుడు చదువుకోనందుకు ఎంతో విచారిస్తుంటాడు. కొడుకు చదువుకోసం ప్రతి నెల తనకొచ్చే బోనసు డబ్బు వాడిపేర పోస్టాఫీసులో వేస్తున్నాడు తన జీతం డైలీ బేటా ఇంటి ఖర్చులకు వాడుతున్నాడు.

"మధ్యాహ్నం స్పేరు డ్రైవర్ని కుదిర్చి ఓనర్ని పెర్మిషన్ అడిగి ఇంటికొచ్చెయ్యాలి"

అనుకున్నాడు.

రాములు షెడ్డు దగ్గరకు వెళ్ళేసరికి ఓనరు ఎవర్నో బూతులు తిడుతున్నాడు. రాములు ఓనరుకి నమస్కరించి ప్రక్కగా నిల్చున్నాడు.

"సూద్రావులూ! ఆ నరసయ్య గోడికి కుసింతేనా యిసవాస వుందీ? ఈయాల వూర్ల మినిట్టరు గోరు దిగతన్నారా! నోడు జాత్తీగుంటాదా! టయాంల నాగా ఎట్టేసినాడు"

"యీయాల నుండీ నువ్వు పదారో నెంబరు రూట్ల ఎల్లు. ఆడి రోగం అనుగుద్ది. నీ రూట్ల యింకోడిని ఎక్కిత్తా. పదారో నెంబరు రూట్ల ఎయ్యమని బతిమిలాడితె పిల్లలోడని జాలొడితే వోరానికి మూడు నాగాలెడతన్నాడు.

సూడు దార్ల ఎక్కడా నోడొగ్గేకు. వుసారుగ దోలాల!"అన్నాడు ఓనరు. "ఏటలా సూస్తున్నావు టయాంలేదు బేగెల్లి బండిదీయ్" అంటూ కసురుకున్నాడు.

రాములు తృళ్లిపడి గబగబా బండి వద్దకు పరిగెత్తేడు.

గజలక్ష్మి ట్రాన్స్‌పోర్టు కంపెనీ కనకయ్యకు ఆ వూర్లో అన్ని రూట్లలోనూ సిటీ బస్సులున్నాయి. స్టాఫ్‌కి రోజు వారీ కలెక్షన్ల బట్టీ నెలకు వందో ఏభయ్యో బోనసు పేర ముట్టచెప్తూ తను వేలకు వేలు లాభాలు ఆర్జిస్తున్నాడు.

సీతాలు ఆ రోజు మధ్యాహ్నం నుండీ భర్త రాకకోసం ఎదురుచూస్తోంది. సాయంత్రం నాలుగు గంటలైంది రాములు రాలేదు. సూర్యం మూడు గంటలకే రడీయై తల్లిని వేధిస్తున్నాడు. త్వరగా బయలుదేరమని లేకుంటే టీచరు దెబ్బలాడతారని.

భర్త రాకకోసం ఇంక వేచి వుండడంవల్ల ప్రయోజనం లేదనుకొని తనకున్న వాటిలో మంచి చీర కట్టుకుని తయారై ఇంటికి తాళంవేసి తాళం చెవులను పక్కింటికిచ్చింది. తన భర్త వస్తే ఇమ్మని చెప్పి కొడుకుని తీసుకుని వాడి స్కూలుకి బయల్దేరింది.

స్కూలు మైదానం జనంతో కిటకిటలాడుతోంది. సూర్యం తన తల్లిని వాళ్ళ టీచరుకి పరిచయం చేసేడు. టీచరు వాళ్ళను ప్రధానోపాధ్యాయులకు పరిచయం చేసి ముందువరుస కుర్చీల్లో కూర్చోపెట్టింది. సీతాలు అక్కడ కూర్చోడానికి ఎంతో మొహమాటపడి వెనుక వరుసలో కూర్చుంటాము అంది. కాని టీచరు అంగీకరించలేదు.

సూర్యం ఫాదరు సభకు రానందున సూర్యం తల్లిని స్టేజిపైకి రమ్మని పిల్చేరు. సీతాలు భయపడి కుర్చీకి అతుక్కుపోయినట్లు కూర్చుంది. సూర్యం తల్లిచెయ్యి పట్టుకుని బలవంతంగా స్టేజీమీదకు తీసుకొని వెళ్ళేడు.

మంత్రిగారి సతీమణి, సీతాలుకి పూలగుచ్ఛాన్ని ఏపిల్ పండు యిచ్చి సత్కరించారు.

సీతాలు వాటిని అందుకొని నమస్కరించి వెనుతిరిగింది.

"ఆగు! ఏటలా ఎల్లిపోతన్నావు? నాను గురుతు నేనేటి సీతాలూ!" అన్నారు మంత్రిగారి సతీమణి.

సీతాలు కాస్త వులిక్కిపడి ఆగి వారిని అప్పుడే గుర్తుపట్టినట్లు ఆశ్చర్యంగా ముఖంపెట్టి "...తవరు వొరలచ్మిగోరు!" అంది.

మంత్రిగారి సతీమణి వరలక్ష్మిగారు, సీతాలు, చిన్ననాటి స్నేహితులు మంత్రిగారు వాళ్ళ వూరు ప్రెసిడెంటుగారి బావమరిది.

"మా యజమాని గోర్ని పోల్తి పట్టినావూ?" అని సీతాలుతో అన్నారు. సీతాలు వారికి వినయంగా నమస్కరించింది.

"మనవూర్ల అమ్మినాయుడి బొట్టి సీతాలు. నా నేస్తురోలు. అల్ల మావనే మనువాడింది. సూడు ఎట్టాంటి సురుకైనోడిని కన్దో! ఆ బుడతడి సేతల ఏదేనా ఎట్టు నేపోతే బాగోదు" అన్నారు ఎంతో పెద్ద మనసుతో మంత్రిగారి సతీమణి, భర్తతో. పెద్ద మనసుతో ఓమారు జేబులు తడువుకొని తాను పర్సు తీసుకొని బయటకెప్పుడూ రాని సంగతి జ్ఞాపకం చేసుకొని, వెంటనే తేరుకొని సూర్యం తెలివితేటలకు గుర్తింపుగా వానికి వెయ్యి నూట పదహార్లు బహుమానం సభలో ప్రకటించేరు.

సీతాలు కొడుకు చెవిలో ఏమో చెప్పింది. సూర్యం ఆ విషయం ప్రధానోపాధ్యాయులకు చెప్పేడు.

ప్రధానోపాధ్యాయులు మైకు ముందుకు వచ్చి "మా స్కూల్లో పేద విద్యార్థుల సహాయ నిధి వున్నట్లు మీకు తెల్సు కదా! మంత్రిగారు తనకు బహుమతిగా ప్రకటించిన సొమ్ము వెయ్యినూట పదహార్లూ పేద విద్యార్థుల సహాయ నిధికి విరాళంగా తీసుకోమని సూర్యం చెప్పేడు. ఈ చిన్నారి పెద్ద మనసుతో ప్రకటించిన విరాళానికి వీనిని అభినందిస్తున్నాను" అన్నారు.

ప్రేక్షకుల కరతాళ ధ్వనులు మిన్నుముట్టేశాయి.

మంత్రిగారు పెద్ద మనసుతో చేసిన ప్రకటన మాత్రం ఆఖరికి ప్రకటనగానే మిగిలిపోయింది.

**(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 23-2-1996)** ✪